క్లుప్తంగా

టీఎస్పీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శుల నియామకం



నియామకపత్రాన్ని అందజేస్తున్న అశోక్

సూర్యాపేటటౌన్ : తెలంగాణ స్టూడెంట్ పరిషత్(టీఎస్పీ) సూర్యాపేట జిల్లా అధ్యక్షుడిగా వర్రె ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శిగా భోనగిరి మహేష్ నియమితులయ్యారు. మంగళవారం ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బారి అశోక్ నియామక ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా బారి అశోక్ మాట్లాడారు. విద్యార్థుల సమస్యలపై నిరంతరం సైనికుడిలా పోరాటం చేస్తానని అన్నారు. త్వరలో నియోజకవర్గం కమిటీలు, మండల స్థాయి కమిటీలను ఏర్పాటు చేసి విద్యార్థుల సమస్యల పరిష్కారానికి ఉద్యమిస్తామని తెలిపారు. కామన్ విద్యా విధానాన్ని అమలు చేయాలని, నిరుద్యోగులకు భృతి కల్పిస్తూ ఉద్యోగ ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు ఉదయ్, నవీన్, శ్రావణ్, నాగరాజు, శేఖర్, సందీప్, భరత్, సూర్య, పరశురాం, వినయ్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

చివ్వెంల : విద్యుత్ లైన్ల కింద చెట్ల కొమ్మలను తొలగించే క్రమంలో బుధవారం మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ మల్లయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిధిలోని ఐలాపురం, వల్లభాపురం, ఉండ్రుగొండ, మున్యానాయక్ తండా, కొండల రాయినిగూడెం, జి.తిర్మలగిరి, గుంపుల, పాశ్యానాయక్‌తండా, లక్ష్మణ్ నాయక్ తండా గ్రామాలతో పాటు, వ్యవసాయానికి సాయంత్రం 4 గంటల నుంచి 6 గంటల వరకు అంతరాయం ఏర్పడనున్నట్లు తెలిపారు. ఆయా గ్రామాల ప్రజలు, రైతులు సహకరించాలని కోరారు.

అర్వపల్లికి చేరిన 'పది' ప్రశ్నపత్రాలు

అర్వపల్లి : ఈ నెల 18 నుంచి జరగనున్న పదో తరగతి వార్షిక పరీక్షల రెండో సెట్ ప్రశ్నపత్రాలను మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో భద్రపర్చారు. జాజిరెడ్డిగూడెం, నాగారం మండలాలకు చెందిన 320 మంది విద్యార్థులు అర్వపల్లిలో పదో తరగతి పరీక్షలు రాయనున్నారు. రెండు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఎంఈఓ బి.బాలునాయక్ తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ మహేందర్‌నాథ్, సీఎస్, డీఓలు గుజ్జ భాస్కర్, రామారావు, వెంకటేశ్వర్లు, శివరాత్రి వెంకన్న పాల్గొన్నారు.


పౌష్టికాహారంపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ అధికారులు

భానుపురి : పోషణ్ పక్షం -2024 కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని బాలాజీనగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం తల్లులకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీఓ కిరణ్మయి, వార్డు కౌన్సిలర్లు ఎలిమినేటి అభినయ్, కొండపల్లి నిఖిల దిలీప్‌రెడ్డి, సూపర్‌వైజర్ అన్నపూర్ణ, అంగన్‌వాడీ టీచర్ పందిరి జ్యోతి, ఆయా భాగ్యలక్ష్మి, తల్లులు, గర్భిణులు, బాలింతలు, ప్రీ స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు.

యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా చిరంజీవి



నియామకపత్రం ఇస్తున్న అశోక్ యాదవ్

నూతనకల్లు : మండల పరిధిలోని టిక్యాతండా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా లౌవుడ్యా చిరంజీవి నాయక్‌ను నియమించినట్లు యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పసుల అశోక్‌యాదవ్ తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలో చిరంజీవికి నియామకపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు లౌవుడ్యా శ్రీధర్, దత్రునాయక్, మోహన్‌నాయక్, దేవేందర్, నెల్లుట్ల మహేష్, గంగయ్య, సికిందర్, నవీన్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

పీఏసీఎస్ అభివృద్ధికి సహకరించాలి

నడిగూడెం : ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అభివృద్ధికి సహకరించాలని స్థానిక సంఘం చైర్మన్ కొల్లు రామారావు కోరారు. మంగళవారం కార్యాలయంలో నిర్వహించిన పాలకవర్గం సమావేశంలో మాట్లాడారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని రకాల రుణాలపై అవగాహన కల్పించాలన్నారు. ఈ నెల 28న రత్నవరంలో నిర్వహించనున్న సహకార సంఘం మహాసభను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో సీఈఓ యలమందరావు, డైరెక్టర్లు పాల్గొన్నారు.

మొక్కల సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ

- వేసవి దృష్ట్యా నర్సరీలపై చలువ పందిళ్ల ఏర్పాటు
- ఉదయం, సాయంత్రం వేళల్లో నీటిని అందిస్తూ ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్న సిబ్బంది
- పెన్‌పహాడ్ మండల వ్యాప్తంగా 2లక్షల 55వేల మొక్కల పెంపకం లక్ష్యం



నారాయణగూడెంలోని నర్సరీలో ఏర్పాటు చేసిన చలువ పందిళ్లు



సింగారెడ్డిపాలెం నర్సరీలో మొక్కలు

పెన్‌పహాడ్ : పల్లెల్లో పచ్చదనం పెంపొందించేందుకు గత ప్రభుత్వం హరితహారం కార్యక్రమాన్ని ప్రవేశపెట్టింది. ఇందులో భాగంగా నర్సరీల్లో వివిధ రకాల మొక్కలు పెంచుతోంది. పండ్ల మొక్కలతో పాటు పలు రకాల మొక్కలు నాటి సంరక్షణ చర్యలు చేపడుతోంది. పదో విడత హరితహారంలో భాగంగా అధికారులు నర్సరీల్లో మొక్కలను బాధ్యతాయుతంగా పెంచుతున్నారు.

మొక్కల సంరక్షణకు చర్యలు..

పెన్‌పహాడ్ మండలంలోని 29గ్రామ పంచాయతీల పరిధిలో నర్సరీలు ఏర్పాటు చేశారు. అవి ఎండిపోకుండా వేసవి దృష్ట్యా ముందస్తు చర్యలు చేపడుతున్నారు. ప్రతి నర్సరీలో జీవామృతం తయారు చేయిస్తున్నారు. మొక్కలు చనిపోకుండా ఆరోగ్యంగా ఉండేందుకు సేంద్రియ ఎరువులను వినియోగిస్తున్నారు. ఎండ తీవ్రత కారణంగా నర్సరీల పైగాన చలువ పందిళ్లు వేయిస్తున్నారు. ప్రతిరోజు ఉదయం, సాయంత్రం వేళల్లో నీళ్లను పట్టిస్తున్నారు.

పలు రకాల మొక్కలు..

పెన్‌పహాడ్ మండలంలో ఏర్పాటు చేసిన 29 నర్సరీల్లో మొత్తం 2లక్షల 55వేల మొక్కల లక్ష్యాన్ని నిర్దేశించారు. పండ్లు, పూలు, నీడనిచ్చే తదితర మొక్కలను నాటించారు. జామ, దానిమ్మ, సీతాఫలం, అల్లనేరేడు, నేరేడు, వెలగ, చెర్రి, ఉసిరి, గులాబీ, మందారం, ముద్దమందారం, చక్రం, నందివర్ధన, గన్నేరు, మల్లె, కాగితం పూలు, వేప, టేకు, కానుగ, నీలగిరి, రావి, సరుగుడు, బేల్ పత్రి, గోరింటాకు, కరివేపాకు, మునగ తదితర అన్ని రకాల మొక్కలను పెంచుతున్నారు.

సంరక్షణ చర్యలు చేపడుతున్నాం



నర్సరీల్లో మొక్కల సంరక్షణకు చర్యలు చేపట్టాం. వేసవిలో ఎండిపోకుండా గ్రీన్‌మ్యాట్స్ ఏర్పాటు చేయించాం. హరితహారం కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కృషి చేస్తున్నాం.

- రవి, ఏపీఓ

మహిళల హక్కులకు పోరాడేది 'ఐద్వా'



ఐద్వా జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

దురాజ్‌పల్లి : మహిళలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం దేశవ్యాప్తంగా ఉద్యమించేది ఐద్వా మాత్రమేనని ఐద్వా జిల్లా కార్యదర్శి మేకన బోయిన సైదమ్మ అన్నారు. మంగళవారం అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో ఐద్వా జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా నాయకురాలు మద్దెల జ్యోతి, అండం నారాయణమ్మ, రాములమ్మ, ఎల్లమ్మ, సుజాత, కవిత, మంజుల, తదితరులు పాల్గొన్నారు.

ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలి



మాట్లాడుతున్న వెంకటేష్

దురాజ్‌పల్లి : రాష్ట్ర ప్రభుత్వం కనీస వేతనాల చట్టం ఆధారంగా కనీస వేతనాలు పెంచాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి వెంకటేష్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలో జరిగిన సీఐటీయూ జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. అక్రాయిడ్ ఫార్ములా, సుప్రీంకోర్టు జడ్జిమెంట్ ప్రకారం కనీస వేతనాలు రూ. 26 వేలకు పెంచాలని కోరారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ముందుగా సానుకూలంగా స్పందించి చివరకు యాజమాన్య సంఘాల మాటలు విని కార్మికుల పొట్టలు కొట్టే నిర్ణయాలు తీసుకోవడం అన్యాయమన్నారు. కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం కార్మిక చట్టాలను కుదించి సంపన్నుల ఖజానా నింపే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో రాంబాబు, చెరుకు యాకలక్ష్మి, శీలం శ్రీను, భాస్కరమ్మ, శేఖర్, యాకూబ్, తదితరులు పాల్గొన్నారు.

పవిత్రతకు, త్యాగానికి చిహ్నం రంజాన్



ఉపవాస దీక్షల క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి

సూర్యాపేట : రంజాన్ పండుగ పవిత్రతకు, త్యాగానికి చిహ్నమని మాజీ మంత్రి, సూర్యాపేట శాసన సభ్యుడు గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. రంజాన్ నెలను పురస్కరించుకొని సూర్యాపేటలోని క్యాంపు కార్యాలయంలో రంజాన్ నెల నిజామే ఔఖాత్ (ఉపవాసాల టైం టేబుల్)ను మున్సిపల్ కో ఆప్షన్ మెంబర్ సయ్యద్ రియాజుద్దిన్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పండుగను భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాలతో నిర్వహించుకోవాలని సూచించారు. పండుగ ఏ మతానికి చెందినా.. దాని వెనుక ఓ సందేశం దాగి ఉంటుందని, అటువంటి పండుగల్లో రంజాన్ ఒకటని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మౌలానా షాహిద్, ఉర్దూ ఘర్ షాదీఖానా చైర్మన్ కరాటే సయ్యద్, మైనార్టీ రాష్ట్ర కార్యదర్శి జానీ బాయ్, మండల కో ఆప్షన్ మెంబర్ మౌలానా గాలిబ్, 13వ వార్డు ఇన్‌చార్జ్ రఫీ భాయ్, ముజీబ్ భాయ్, నయీం భాయ్, గౌస్ భాయ్ పాల్గొన్నారు.

అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు తప్పవు

మద్దిరాల : ఎవరైనా అక్రమంగా ఇసుక తరలించినట్లయితే చర్యలు తప్పవని ఎస్ఐ మధునాయుడు తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. అనుమతి ఉన్న ట్రాక్టర్లు ఎక్కడికైతే అనుమతి తీసుకున్నారో అక్కడికే ఇసుకను తరలించాలని అన్నారు. అలా కాకుండా మరోచోటికి తరలించినట్లయితే కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. అక్రమంగా సారాయి తయారు చేసినా, అక్రమంగా పీడీఎస్ బియ్యం తరలించినా ప్రజలు తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు.

ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు హర్షణీయం

భానుపురి : తెలంగాణ రాష్ట్ర క్యాబినెట్ సమావేశంలో ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటుకు నిర్ణయం తీసుకోవడం హర్షణీయమని సూర్యాపేట జిల్లా ఆర్య వైశ్య సంఘ అధ్యక్షుడు మాశెట్టి అనంతరాములు, ప్రధాన కార్యదర్శి బండారు రాజా, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ శ్రీనివాస్ అన్నారు. ఈ సందర్భంగా వారు మంగళవారం సూర్యాపేటలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి బీద వైశ్య విద్యార్థులను, కుటుంబాలను ఆదుకోవాలని అన్నారు. నూతన ప్రభుత్వం ఏర్పడిన 100 రోజుల్లోనే వైశ్య వర్గాలకు ఇచ్చిన హామీని నిలబెట్టినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రివర్గ సహచరులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఇమ్మడి సోమనర్సయ్య, జిల్లా ఆర్యవైశ్య నాయకులు మంచాల రంగయ్య, మీలా వాసుదేవ్, మీలా మహదేవ్, గుండా రమేష్, కక్కిరేణి చంద్రశేఖర్, గోపారపు రాజు, భువనగిరి విజయకుమార్, బ్రాహ్మణపల్లి మురళీధర్, పబ్బ ప్రకాష్, కర్నాటి వంశీ, యాదా కిరణ్, యువజన సంఘం అధ్యక్షుడు మీలా వంశీ, కలకోట లక్ష్మయ్య, శ్రీనివాసరావు, బచ్చు పురుషోత్తం, గుండా వెంకన్న, బొల్లం సురేష్, గుడిపాటి రమేష్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

విక్రమన్న ఆశయాలను కొనసాగిస్తాం



దురాజ్‌పల్లి : నివాళులర్పిస్తున్న నాయకులు



నూతనకల్‌లో నివాళులర్పిస్తున్న నాయకులు

దురాజ్‌పల్లి : పీడిత ప్రజల నాయకుడు విక్రమన్న ఆశయాలను కొనసాగిస్తామని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శివకుమార్ అన్నారు. మంగళవారం విక్రమన్న వర్ధంతి సందర్భంగా జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ జిల్లా కమిటీ సభ్యులు కారింగుల వెంకన్న, పీఓడబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి రేణుక, పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎర్ర అఖిల్ కుమార్, పేర్ల నాగయ్య, సయ్యద్, వీరబోయిన రమేష్, శ్రీకాంత్, నవీన్, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

మందడి సత్తిరెడ్డికి ఘన నివాళి

పీడిత ప్రజల పక్షాన నిలబడి దోపిడీ వ్యవస్థ రద్దు కోసం నిరంతరం పోరాడుతూ హత్యకు గురైన మందడి సత్తిరెడ్డి (విక్రమన్న) వర్ధంతిని మంగళవారం న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలోని చంద్ర పుల్లారెడ్డి విజ్ఞాన కేంద్రంలో విక్రమన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి మండారి డేవిడ్ కుమార్, నాయకులు బొడ్డు శంకర్, పోలెబోయిన కిరణ్, మందడి శ్రీధర్, గజ్జల మల్లారెడ్డి, జానయ్య, దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

విక్రమన్న ఆశయసాధనకు కృషి చేయాలి

నూతనకల్లు : విప్లవోద్యమ నాయకుడు సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు విక్రమన్న ఆశయసాధనకు కృషి చేయాలని ఆ సంఘం డివిజన్ నాయకుడు జటంగి వీరమల్లు కోరారు. మంగళవారం మండల కేంద్రంలో నిర్వహించిన విక్రమన్న వర్ధంతి కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా విక్రమన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో న్యూడెమోక్రసీ నాయకులు గడ్డం పాపయ్య, కట్ట భిక్షంరెడ్డి, పంతం రామచంద్రు, సైదులు, రామచంద్రు, మనీ కుమార్, శ్రీరాములు పాల్గొన్నారు.

'మన ఊరు - మన బడి'కి నిధుల బెడద

- జాజిరెడ్డిగూడెం మండలంలో 11 పాఠశాలల్లో ప్రారంభమైన పనులు
- ఇప్పటివరకు కేవలం మూడు పాఠశాలల్లోనే పనులు పూర్తి
- నిధుల విడుదలలో నెలల తరబడి జాప్యంతో ఇబ్బందులు



బిల్లులు రాక అర్వపల్లి ప్రాథమిక పాఠశాలలో అసంపూర్తిగా నిలిచిపోయిన నిర్మాణ పనులు



అర్వపల్లి జెడ్పీహెచ్ఎస్‌లో అసంపూర్తిగా డైనింగ్ హాల్ నిర్మాణం

అర్వపల్లి : ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో గత ప్రభుత్వం మన ఊరు–మన బడి పథకాన్ని ప్రారంభించింది. గతంలోనే పనులు ప్రారంభించినప్పటికీ అప్పటి నుంచి నిధుల కొరతతో నిర్మాణ పనుల్లో తీవ్ర జాప్యం ఏర్పడింది. గతంలో జరిగిన పనులకు బిల్లులు రాక మాజీ ఎస్ఎంసీ చైర్మన్లు, కాంట్రాక్టర్లు, సర్పంచ్‌లు ఇబ్బందుల పాలవుతున్నారు. దీంతో పనులను అసంపూర్తిగా వదిలి వేయాల్సిన పరిస్థితి నెలకొంది. జాజిరెడ్డిగూడెం మండలానికి సంబంధించి మన ఊరు– మనబడి పథకం కింద 11 జెడ్పీహెచ్ఎస్, ప్రాథమిక పాఠశాలలకు సుమారు రూ.4 కోట్ల నిధులు మంజూరయ్యాయి. కానీ బిల్లుల విడుదలలో తీవ్ర జాప్యం జరుగుతుండటంతో ఎక్కడి పనులు అక్కడే ఆగిపోయాయి. మండలంలోని అర్వపల్లి, జాజిరెడ్డిగూడెం, కాసర్లపహాడ్, తిమ్మాపురం జెడ్పీహెచ్ఎస్‌లతో పాటు అర్వపల్లి, అడివెంల, కాసర్లపహాడ్, తిమ్మాపురం, పర్సాయపల్లి, జాజిరెడ్డిగూడెం ప్రాథమిక పాఠశాలల్లో అప్పట్లోనే పనులు ప్రారంభించారు. అయితే రామన్నగూడెం, అడివెంల, జాజిరెడ్డిగూడెం ప్రాథమిక పాఠశాలల్లో మాత్రమే పనులు పూర్తయ్యాయి. మిగిలిన పాఠశాలల్లో పనులు పూర్తి కావాల్సి ఉంది. జెడ్పీహెచ్ఎస్‌లలో డైనింగ్‌హాల్స్ నిర్మాణాలు కూడా పూర్తి కావాల్సి ఉంది. కానీ చేసిన పనులకు కూడా నిధులు విడుదల కాకపోవడంతో మిగిలిన పనులు చేపట్టలేని పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా అధికారులు నిధులు విడుదల చేయించి, మన ఊరు–మన బడి పథకం పనులను వేగవంతంగా పూర్తి చేయించాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

పనులు పూర్తి చేయాలి



మన ఊరు– మన బడి పథకం కింద చేపట్టే పాఠశాలల అభివృద్ధి పనులకు వెంటనే నిధులు విడుదల చేయాలి. వెంటనే పనులు పూర్తిచేసి విద్యార్థుల ఇబ్బందులు తీర్చాలి. 2022లో ఈ పథకం పనులు ప్రారంభం కాగా ఇంతవరకు పూర్తి కావడం లేదు.

- మచ్చ నర్సయ్య, పీపీఎల్ రాష్ట్ర అధ్యక్షుడు

పనులు చేపడుతున్నాం



మన ఊరు – మన బడి పథకం ద్వారా మంజూరైన నిధులతో ఇప్పటికే మూడు పాఠశాలల్లో పనులు పూర్తి చేశాం. మిగిలిన పాఠశాలల్లో కూడా పనులు చేపడుతున్నాం. అసెంబ్లీ ఎన్నికలు తదితర కారణాలతో పనుల్లో కొంత ఆలస్యం జరిగింది. నిధుల విడుదల మేరకు పనులు పూర్తి చేస్తాం.

- అశోక్, పీఆర్ ఏఈ

ఎంసీపీఐయూ అభ్యర్థులను గెలిపించాలి



సమావేశమైన ఎంసీపీఐయూ నాయకులు

అర్వపల్లి : వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీఎల్ఎఫ్ బలపర్చిన ఎంసీపీఐయూ అభ్యర్థులను గెలిపించాలని ఆ పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు వరికుప్పల వెంకన్న కోరారు. మంగళవారం మండల పరిధిలోని తిమ్మాపురంలో ఎంసీపీఐయూ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మత రాజకీయాలు చేస్తున్న బీజేపీని ఈ ఎన్నికల్లో ప్రజలు ఓడించాలన్నారు. విశ్వకర్మ పథకానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని కోరడం రాజకీయంగా లబ్ధిపొందడం కోసమేనని విమర్శించారు. డివిజన్ ఇన్‌చార్జ్ ఈదురు వీరపాపయ్య అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి ఎస్‌కె.నజీర్, ఏపూరి పెదసోమయ్య, ఉత్తరయ్య, నాగన్న, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో నీటి సమస్య తలెత్తకుండా చర్యలు



మోటార్‌ను మరమ్మతు చేయిస్తున్న అధికారులు

అర్వపల్లి : వేసవిలో నీటి సమస్య తలెత్తకుండా తగు చర్యలు తీసుకుంటున్నట్లు కొమ్మాల గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారి ఎల్. చరణ్ చెప్పారు. మంగళవారం గ్రామాన్ని సందర్శించి గ్రామంలో చెడిపోయిన బోరు మోటార్లను మరమ్మతు చేయించారు. కొమ్మాల గ్రామ పంచాయతీ పరిధిలోని ఆవాస తండాలలో మంచినీటి సమస్య రాకుండా బోరు మోటార్లు, మంచినీటి పథకాల పనితీరును పరిశీలించారు. మిషన్‌భగీరథ నీళ్లు కూడా నిరంతరం వచ్చేలా ఆ శాఖ సిబ్బందితో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నారాయణమూర్తి, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

కుష్టువ్యాధి సర్వేను ఇంటింటికీ చేపట్టాలి



కొమ్మాలలో సర్వేను పరిశీలిస్తున్న సీహెచ్ఓ

అర్వపల్లి : కుష్టు వ్యాధి నివారణకు చేపట్టిన సర్వేను గ్రామాల్లో వైద్యసిబ్బంది ఇంటింటికీ తిరిగి చేపట్టాలని మండల వైద్యాధికారి డాక్టర్ చిలుకూరి మణిదీప్, సీహెచ్ఓ ఎల్. చరణ్ కోరారు. మంగళవారం మండల పరిధిలోని కొమ్మాల, లోయపల్లి గ్రామాల్లో జరుగుతున్న ఇంటింటి సర్వేను వారు పరిశీలించారు. జాతీయ కుష్టువ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా ఈ నెల 24 వరకు సర్వే చేపడుతున్నట్లు తెలిపారు. శరీరంపై స్పర్శలేని ఎర్రని రాగి రంగు, గోధుమ రంగు మచ్చలు ఉంటే ఈ వ్యాధి లక్షణంగా గుర్తించవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ వర్షిత, ఆశా కార్యకర్తలు రోజ, మనీల తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరిక

కోదాడ : గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఎస్పీ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి పాలైన పిల్లుట్ల శ్రీనివాస్ మంగళవారం హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పద్మావతి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ అన్ని వర్గాల అభివృద్ధి కోసం కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న కార్యక్రమాలకు మద్దతుగా తాను కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల్లో మంత్రి ఉత్తమ్, ఎమ్మెల్యే పద్మావతిల ఆధ్వర్యంలో పార్టీ గెలుపు కోసం కృషి చేస్తానని అన్నారు.

అర్వపల్లి దేవాలయ హుండీ లెక్కింపు



హుండీ లెక్కిస్తున్న అధికారులు, కమిటీ సభ్యులు

అర్వపల్లి : అర్వపల్లిలోని శ్రీయోగానందలక్ష్మీనర్సింహస్వామి దేవాలయ వార్షిక బ్రహ్మోత్సవాలు ముగియడంతో ఆలయంలో మంగళవారం హుండీని లెక్కించారు. ఈసారి రూ.3,27,881 నగదు రూపేణ ఆదాయం వచ్చినట్లు దేవాదాయ శాఖ ఉమ్మడి జిల్లా ఇన్‌స్పెక్టర్ ఎం. వెంకటలక్ష్మి, ఉత్సవ కమిటీ చైర్మన్ అనిరెడ్డి రాజేందర్‌రెడ్డి, ఈఓ శ్రీనివాసరెడ్డి తెలిపారు. గతేడాది హుండీ ద్వారా రూ.2,37,650 రాగా ఈసారి రూ.90, 231 ఆదాయం పెరిగిందని చెప్పారు. కార్యక్రమంలో అర్చకుడు రాంబాబుఅయ్యంగార్, ధర్మకర్తలు జేరుపోతుల సోమయ్య, దిర్శనపు కృష్ణమూర్తి, కనుకు రేణుక, గడ్డం శేఖర్, జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాసరెడ్డి, సదాలక్ష్మి, అనిల్, కోటిప్రసాద్, మనోహర్, సంపత్ పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌ల పంపిణీ



గోరెంట్ల జెడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లను అందజేస్తున్న సుల్తాన్ నరేష్

మద్దిరాల : మండల పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న 10వ తరగతి విద్యార్థులకు కాంగ్రెస్ పార్టీ ఎన్ఎస్‌యూఐ మండల అధ్యక్షుడు సుల్తాన్ నరేష్ మంగళవారం పరీక్షప్యాడ్లు, పెన్నులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పరీక్షలు బాగా రాసి మంచి మార్కులు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ తాళ్లపెల్లి సురేష్‌గౌడ్, నాయకులు వెంకటేశ్వర్లు, సంగని విద్యాసాగర్, కంఠ్లం, వెంకటేష్, హెచ్ఎం శ్రీనివాస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కరువు మండలంగా ప్రకటించాలని వినతి



ఆత్మకూరులోని తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందిస్తున్న నాయకులు

ఆత్మకూర్ (ఎస్) : ఆత్మకూర్ (ఎస్) మండలాన్ని కరువు మండలంగా ప్రకటించి రైతులను ఆదుకోవాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ సబ్ డివిజన్ కార్యదర్శి కునుకుంట్ల సైదులు అన్నారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ, అఖిల భారత రైతుకూలీ సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ప్రభుత్వాలు రైతులను విస్మరించాయని తెలిపారు. నీరు లేక ఎండిపోయిన పొలాలకు ఎకరానికి రూ.30వేల నష్టపరిహారం చెల్లించాలని, ఎస్సారెస్పీ నీటిని చివరి ఆయకట్టు వరకు అందేలా చూడాలన్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో ఆర్ఐ అంజయ్యకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ జిల్లా నాయకుడు పోరండ్ల దశరథ, మండల నాయకులు డేగల వెంకటకృష్ణ, కొండేటి సంజీవరెడ్డి, అరుణోదయ జిల్లా నాయకులు బొల్లే వెంకన్న, ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు సామ నర్సిరెడ్డి, పీఓడబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి కంచర్ల నర్సక్క, సీతారాం రెడ్డి, మాచిరెడ్డి, వీరారెడ్డి, సుదగాని వెంకన్న, బోయిని నాగయ్య, తాళ్లపల్లి లింగయ్య పాల్గొన్నారు.

సోషల్ మీడియా జిల్లా కోఆర్డినేటర్‌గా నవీన్



తుంగతుర్తి : టీపీసీసీ సోషల్ మీడియా జిల్లా కోఆర్డినేటర్‌గా మండల పరిధిలోని వెలుగుపల్లి గ్రామానికి చెందిన రామడుగు నవీన్ నియమితులయ్యారు. రాష్ట్ర సోషల్ మీడియా కోఆర్డినేటర్ పెట్టం నవీన్ మంగళవారం రామడుగు నవీన్‌కు నియామకపత్రం అంజేశారు. ఈ సందర్భంగా రామడుగు నవీన్ మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి శక్తి వంచన లేకుండ కృషి చేస్తానని అన్నారు. తన నియామకానికి సహకారించిన ఎమ్మెల్యే మందుల సామేల్‌కు, మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డికి, మీడియా రాష్ట్ర కోఆర్డినేటర్ పెట్టం నవీన్‌కు, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు చెవిటి వెంకన్నయాదవ్‌కు, టీపీసీసీ సభ్యుడు గుడిపాటి నర్సయ్యకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

మిస్సింగ్ కేసు నమోదు



గోవిందరెడ్డి

ఆత్మకూర్(ఎస్) : మండల పరిధిలోని మిద్దనపల్లి గ్రామానికి చెందిన సామ గోవిందరెడ్డి ఈ నెల 5 నుంచి కనిపించడంలేదని ఆయన కుమార్తె సునీత మంగళవారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింద. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ వై.సైదులు తెలిపారు. ఈ నెల 5వ తేదీన హైదరాబాద్ హాస్పిటల్‌కు వెళ్తున్నానని చెప్పి తిరిగి ఇంటికి రాలేదని, బంధువుల ఇళ్ల వద్ద వెతికినా ఆచూకీలేదని ఆయన కుమార్తె అందించిన ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

ట్రాక్టర్‌ను ఢీకొని గాయాలు

పెన్‌పహాడ్ : దూపహాడ్ గ్రామ శివారులో ఆగి ఉన్న ట్రాక్టర్‌ను బైక్ ఢీకొనగా ఇద్దరికి గాయాలయ్యాయి. నేరేడుచర్ల మండలం మేడారం గ్రామానికి చెందిన మామిడి నాగయ్య, కోల హుస్సేన్‌లు మంగళవారం సూర్యాపేట నుంచి బైక్‌పై ఇంటికి వెళ్తున్నారు. ఈ క్రమంలో దూపహాడ్‌లో ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ఢీకొట్టారు. దీంతో నాగయ్యకు తీవ్ర గాయాలు కాగా, హుస్సేన్‌కు స్వల్ప గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం సూర్యాపేటలోని ఆస్పత్రికి తరలించారు.